# పంటల వివరాలు నమోదు చేయించుకోవాలి

**రంగారెడ్డిజిల్లా వ్యవసాయశాఖ అధికారి గీతారెడ్డి**



షాబాద్, అక్టోబర్ 13: రైతులు వానకాలం సీజన్‌లో సాగుచేసిన పంటల పూర్తి వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయించుకోవాలని రంగారెడ్డి జిల్లా వ్యవసాయశాఖ అధికారి గీతారెడ్డి అన్నారు. శుక్రవారం షాబాద్ మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో రైతుల పంటల వివరాల నమోదు కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గ్రామాల్లో వ్యవసాయ శాఖ విస్తరణ అధికారులు సర్వే నంబర్ల వారీగా పంటల వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నట్లు తెలిపారు. పంటల నమోదు ఆధారంగానే ప్రభుత్వం పంటల కొనుగోళ్లు చేస్తుందని తెలిపారు. ఆమె వెంట మండల వ్యవసాయాధికారి వెంకటేశం, ఏఈవో రాజేశ్వరి, రైతులు తదితరులు ఉన్నారు.

# నిష్పక్షపాతంగా విధులు నిర్వహించాలి

**కలెక్టర్ భారతి హోలీకేరి**

**ఎన్నికల ఏర్పాట్లపై**

**నోడల్ అధికారులతో సమావేశం**

ఇబ్రహీంపట్నం, అక్టోబర్ 13: జిల్లాలో ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలులో ఉన్నందున నోడల్ అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేస్తూ.. క్షేత్రస్థాయిలో పకడ్బందీగా అమలు చేయాలని కలెక్టర్ భారతి హోలీకేరి అన్నారు. ఎన్నికల్లో సమర్థవంతంగా విధులు నిర్వహించాలన్నారు. ఎన్నికల పనులు, ఎన్నికల సంఘం సూచించిన మార్గదర్శకాల మేరకు పూర్తిచేయాలని, సిబ్బందికి శిక్షణా శిబిరాలు చేపట్టాలన్నారు. పోలింగ్ రోజు ఈవీఎంల నిర్వహణ, ఎన్నికల ప్రవర్తనా నియమావళి వంటివి పకడ్బందీగా అమలుచేయాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు ప్రతిమాసింగ్, భూపాల్‌రెడ్డి, డీఆర్వో సంగీత, జెడ్పీ సీఈవో దిలీప్‌కుమార్, డీఆర్డీఏ పీడీ ప్రభాకర్, సీపీవో సౌమ్య, డీసీసీవో డా క్రిదేవి, పరిశ్రమలశాఖ అధికారి రాజేశ్వర్‌రెడ్డి, విద్యాశాఖ అధికారి సుశీందర్‌రావు, సివిల్ సప్లై అధికారి మనోహర్ రాథోడ్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ భారతి హోలీకేరి

## జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలి

షాద్‌నగర్‌టౌన్, అక్టోబర్ 13 : షాద్‌నగర్ ప్రభుత్వ ఐ.టీ.ఐ కళాశాలలో ఈ నెల 16న నిర్వహించే జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ తిరుపతిరెడ్డి శుక్రవారం ప్రకటనలో తెలిపారు. ఐ.టీ.ఐలో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు HTTP// APPRENTICE SHIPINDIA.ORG ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకొని ఉదయం 10:00 గంటలకు హాజరుకావాలన్నారు. మరింత సమాచారం కోసం 98492 44030లో సంప్రదించాలని తెలిపారు.

## కల్వకుర్తి బీఆర్ఎస్ అసెంబ్లీ ఎన్నికల ఇన్‌చార్జిగా గోలి శ్రీనివాస్‌రెడ్డి

ఆమనగల్లు, అక్టోబర్ 13 : రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డికి బీఆర్ఎస్ పార్టీ అదనపు బాధ్యతలను అప్పజెప్పింది. కల్వకుర్తి నియోజకవర్గ అసెంబ్లీ ఎన్నికల ఇన్‌చార్జిగా నియమించినట్లు ఒక ప్రకటనలో పేర్కొంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జైపాల్‌యాదవ్ గెలుపునకు కృషి చేస్తామన్నారు.

## 15 నుంచి వేంకటేశ్వర స్వామి ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాలు



వేంకటేశ్వరస్వామి

చేవెళ్లటౌన్, అక్టోబర్ 13 : చేవెళ్లలోని లక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయంలో దేవీశరన్నవరాత్రి మహోత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఈ నెల 15వ తేదీ నుండి 23వరకు అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించేందుకు నిర్వాహకులు ముమ్మర ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రతిరోజూ అభిషేకాలు, వేదపారాయణం, అర్చన, సేవ తదితర పూజా కార్యాక్రమాలు నిర్వహిస్తారు. ఆలయాన్ని తోరణాలు, విద్యుత్ దీపాలతో అందంగా ముస్తాబు చేస్తున్నారు. ఉత్సవాలకు వచ్చే భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆలయ ధర్మాదాయ శాఖ అధికారులు తెలిపారు. ఈ పూజా కార్యక్రమాలకు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని దేవస్థానం ఈవో నరేందర్, ధర్మకర్త శ్రీకాంతాచారి, శ్రీపాద్ , ఫౌండర్‌ట్రస్ట్ మాణిక్య ప్రభు తెలిపారు.

**ఉత్సవాలకు ఏర్పాట్లు..**

చేవెళ్ల మండల కేంద్రంలోని లక్ష్మీ వేంకటేశ్వర స్వామి దేవాలయంలో శరన్నవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాటు చేస్తున్నాం. ఆలయంలో స్వామి వారికి ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తాం. ఉత్సవాలను విజయవంతం చేసేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలి.

## ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించాలి

**అడిషనల్ కలెక్టర్ ప్రతిమా సిన్హా, డీసీపీ నారాయణరెడ్డి**

**మల్లాపూర్‌ను సందర్శించిన అధికారులు**

కొత్తూరు, అక్టోబర్ 13 : ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరుపుకోవాలని అడిషనల్ కలెక్టర్ ప్రతిమా సిన్హా, డీసీపీ నారాయణరెడ్డి అన్నారు. ఎన్నికల ఏర్పాట్లలో భాగంగా అడిషనల్ కలెక్టర్ ప్రతిమా సిన్హా, డీసీపీ నారాయణరెడ్డి కొత్తూరు మండల పరిధిలోని మల్లాపూర్‌ను శనివారం సందర్శించారు. అనంతరం గ్రామంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ ప్రశాంతమైన వాతావరణంలో ఎన్నికలు నిర్వహించాలని సూచించారు. చట్టాన్ని ఉల్లఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. సమావేశంలో ఏసీపీ రామచంద్రారావు, తహసీల్దార్ జానకి, ఎంపీడీవో శరత్ చంద్రబాబు, సీఐ శంకర్‌రెడ్డి గ్రామస్తులు పాల్గొన్నారు.



అధికారులకు సూచనలు చేస్తున్న అడిషనల్ కలెక్టర్ ప్రతిమాసిన్హా

## ఆర్టీసీ ప్రయాణికులకు దసరా లక్కీ డ్రా

- మహేశ్వరం డిపో మేనేజర్ ఎంఎం రెడ్డి

మహేశ్వరం, అక్టోబర్ 13: ఆర్టీసీ ప్రయాణికులకు దసరా పండుగ సందర్భంగా లక్కీ డ్రాను నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు అందజేస్తామని మహేశ్వరం డిపో మేనేజర్ ఎంఎ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈనెల 20 నుంచి 23 వరకు.. 28 నుంచి 30 వరకు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించిన ప్రయాణికులకు లక్కీ డ్రా ద్వారా తుక్కుగూడలో 10 మంది పురుషులకు, 5 గురు మహిళలకు ఒక్కొక్కరికి రూ.9,990 విలువ చేసే నగదు బహుమతులను అందజేస్తామని తెలిపారు. తుక్కుగూడ బస్‌స్టాండ్‌లో మహిళా ప్రయాణికులకు, పురుషులకు వేర్వేరుగా డ్రా బాక్స్‌లను ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు.

## అక్రమ మద్యం స్వాధీనం

ఆర్కేపురం, అక్టోబర్ 13 : గోవా నుంచి అక్రమంగా తరలిస్తున్న మద్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్న ఘటన సరూర్‌నగర్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సరూర్‌నగర్ ప్రోహిబీషన్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ జి.శ్రీనివాస్‌రావు తెలిపిన వివరాల ప్రకారం.. డీసీ రంగారెడ్డి డేవిడ్ రవికాంత్ ఆదేశాల మేరకు సరూర్‌నగర్ డిస్ట్రిక్ ప్రొహిబిషన్, ఎక్సైజ్ అధికారి టి.రవీందర్‌రావు సూచనల మేరకు అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ బి.హనుమంతరావు నేతృత్వంలో సరూర్‌నగర్ ఎక్సైజ్ స్టేషన్ అధికారులు, సిబ్బంది మల్లాపూర్‌లోని ఓ ఇంటిపై దాడి చేసి గోవాకు సంబంధించిన (131) రాయల్ స్టాగ్ బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా పట్టుబడ్డ వ్యక్తి దినేశ్ గొడిక్యను విచారించగా తాను రాయల్ స్టాగ్ బాటిళ్లను గోవాలో తక్కువ ధరకు కొని తెచ్చి మల్లాపూర్ ప్రాంతంలో ఎక్కువ ధరకు అమ్ముతానని నిందింతుడు తెలిపారు. స్వాధీనం చేసుకొన్న మొత్తం సొత్తు విలువ రూ.1,20,000 ఉంటుందని శ్రీనివాస్‌రావు తెలిపారు. ఎక్సైజ్ సబ్ ఇన్‌స్పెక్టర్లు ముజహీద్ సుతరి, ఇబ్రహీం పాషా, కె.సమజ, సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా పరిశీలించాలి

**శంషాబాద్ డీసీపీ నారాయణరెడ్డి**

**కడ్తాల్ చెక్‌పోస్టును సందర్శించిన డీసీపీ, ఏసీపీ**

కడ్తాల్, అక్టోబర్ 13: ఎన్నికల కోడ్ నేపథ్యంలో ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా పరిశీలించాలని శంషాబాద్ డీసీపీ నారాయణ రెడ్డి అన్నారు. అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కడ్తాల్ కేంద్రం సమీపంలోని హైదరాబాద్–శ్రీశైలం ప్రధాన రహదారిపై పోలీసులు ఏర్పాటు చేసిన చెక్‌పోస్టును, శుక్రవారం సాయంత్రం ఏసీపీ రంగస్వామితో కలిసి డీసీపీ సందర్శించారు. ఈ సందర్భంగా పోలీసులకు ఆయన పలు సూచనలు చేశారు. ఎన్నికల నియమాలను అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం పోలీసులతో కలిసి ఆయన పలు వాహనాలను తనిఖీ చేశారు. కార్యక్రమంలో కడ్తాల్ ఎస్‌హెచ్‌వో శివప్రసాద్, ఎస్ఐ హరిశంకర్‌గౌడ్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



## అదృశ్యమైన వ్యక్తి మృతదేహం లభ్యం

మొయినాబాద్, అక్టోబర్13 : ఇంట్లో నుంచి వెళ్లి పోయిన ఓ వ్యక్తి శవమై కనిపించాడు. ఈ ఘటన మొయినాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. సీఐ ఏవీ రంగా తెలిపిన వివరాల ప్రకారం మండల పరిధిలోని కనకమామిడి గ్రామానికి చెందిన మొండ్ర మల్లేశ్ (50) షాప్ కీపర్‌గా పని చేసే వాడు. మల్లేశ్ మూడు రోజుల క్రితం ఇంట్లో నుంచి వెళ్లిపోవడంతో భార్య పార్వతమ్మ అదృశ్యం అయినట్లుగా పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు పోలీసులు దర్యాప్తు చేపట్టగా, శుక్రవారం తోలుకట్టా గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సమీప ప్రభుత్వ భూమిలో అనుమానాస్పద స్థితిలో శవమై కనిపించాడు. పోలీసులకు సమాచారం అందించడంతో ఘటనా స్థలానికి చేరుకొని పంచనామా చేశారు. ఎవరో హత్య చేసి ఉంటారని కుటుంబ సభ్యులు ఆరోపించడంతో పోలీసులు కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చేవెళ్ల ప్రభుత్వ దవాఖానకు తరలించారు.

## గుర్తుతెలియని వాహనం ఢీకొని మహిళ మృతి

చేవెళ్ల రూరల్, అక్టోబర్ 13 : గుర్తుతెలియని వాహనం ఢీకొని మహిళ మృతి చెందిన ఘటన చేవెళ్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఫరూక్ నగర్ మండలం యెల్లంపల్లి గ్రామానికి చెందిన ఎర్ర నర్సమ్మ(35) గత కొన్ని నెలల నుంచి షాద్‌నగర్‌లో ఉంటూ కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నది. గురువారం ఉదయం సొంత గ్రామమైన యెల్లంపల్లికి వెళ్లి తిరిగి వచ్చి శుక్రవారం తెల్లవారు జామున హైదరాబాద్ –బీజాపూర్ రహదారిపై చేవెళ్ల మండలం ముడిమ్యాల కంచె వద్ద నర్సమ్మ రోడ్డు దాటుతుండగా వికారాబాద్ నుంచి వస్తున్న గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. తలకు తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందింది. పోలీసులకు సమాచారం అందడంతో ఘటనా స్థలానికి చేరుకుని కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని చేవెళ్ల ప్రభుత్వ దవాఖానలో పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతురాలికి భర్తతో పాటు ముగ్గురు పిల్లలు ఉన్నారు. ఈ మేరకు భర్త ఎర్ర రాములు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## కారు, లారీ ఢీ.. ఒకరికి గాయాలు

యాచారం, అక్టోబర్ 13 : కారు, లారీ ఢీకొని ఒకరికి గాయాలైన ఘటన యాచారం పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు, స్థానికులు తెలిపిన కథనం ప్రకారం..హైదరాబాద్ వనస్థలిపురానికి చెందిన రాజశేఖర్, మేఘన దంపతులు పెళ్లి రోజు కావడంతో తన తల్లి సరస్వతితో కలిసి నల్లగొండ జిల్లా చింతపల్లి సాయిబాబా దేవాలయానికి కారులో వెళ్లి వస్తున్నారు. మండలంలోని గున్‌గల్ గేటు వద్దకు రాగానే హైదరాబాద్ నుంచి మాల్ వైపు ఎదరుగా వస్తున్న లారీ కారును ఢీకొట్టింది. ప్రమాదంలో కారు నుజ్జునుజ్జయింది. ఇందులో ప్రయాణిస్తున్న సరస్వతి తలకు తీవ్ర గాయాలు కాగా, రాజశేఖర్, మేఘనలకు స్వల్ప గాయాలయ్యాయి. వీరిని వనస్థలిపురం ఏరియా దవాఖానకు తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.




ప్రమాదంలో నుజ్జునుజ్జయిన కారు

## మంత్రి సబితా ఇంద్రారెడ్డిని గెలిపించాలి

కందుకూరు, అక్టోబర్ 13 : ప్రతిపక్షాల మాటలు నమ్మి ఎన్నికల్లో మోసపోవద్దని మార్కెట్ కమిటీ చైర్మన్ సురుసాని సురేందర్‌రెడ్డి తెలిపారు. గురువారం గూడూరు, కొత్తూరు గ్రామాల్లో జరిగిన కార్యకర్తల సమావేశంలో పాల్గొని మాట్లాడుతూ.. మంత్రి సబితా ఇంద్రారెడ్డిని గెలిపించడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి ఓట్లు అడగాలని.. గెలుపే లక్ష్యంగా పని చేయాలని కోరారు. కోట్లాది రూపాయలతో మంత్రి సబితా ఇంద్రారెడ్డి అభివృద్ధి చేసిందని, మరింత అభివృద్ధి చెందాలంటే గెలిపించాల్సిన అవసరం ఉందని చెప్పారు.